# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 06-07-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

❖ ప్రజా సమస్యలకు ఆర్టీజీఎస్ కేంద్రం తక్షణమే స్పందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

❖ గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు అన్నారు.

❖ సముద్రంలో ఇటీవల వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని కోస్టల్ సెక్యూరిటీ ఐజీ గోపీనాథ్ జెట్టీ తెలిపారు.

❖ దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా మంత్రి నారా లోకేశ్ వివిధ సంస్థల ప్రతినిధులతో సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని విజ్ఞప్తి చేశారు.

========================

ప్రజల సమస్యలకు రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రం (ఆర్టీజీఎస్) నుంచి తక్షణ స్పందన రావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో ఆయన ఈరోజు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి.. పురపాలక, పంచాయితీరాజ్, హోం, ఎక్సైజ్ తదితర శాఖల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... అధికారులు క్షేత్రస్థాయి పర్యటనల వల్ల ప్రజాభిప్రాయం నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించేలా కలెక్టర్లు, ఉన్నతాధికారులు భాధ్యత తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. గిరిజన ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించిన ముఖ్యమంత్రి.. రాష్ట్రంలో మహిళలపై నేరాలు గణనీయంగా తగ్గేలా చర్యలు చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో తాగునీరు, వ్యర్థాల సేకరణకు స్వచ్ఛ రథాలు, ఇంటింటికీ చెత్త సేకరణ లాంటి అంశాల్లో నిర్దిష్టమైన కార్యాచరణ జారీ చేయాలన్నారు. నెల రోజుల్లోగా అన్ని ప్రభుత్వ శాఖలు అవేర్ 2.0 ద్వారా ఏ మేరకు ఫలితాలు వచ్చాయో విశ్లేషించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

========================

గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజక వర్గం పరిధిలో సుమారు 12 కోట్ల రూపాయలు విలువ చేసే అభివృద్ధి పనులను ఆయన ఈరోజు ప్రారంభించారు. ధనుపురం గ్రామంలో 29 లక్షల రూపాయలతో నిర్మించిన చెక్ డామ్‌ను, పాతపట్నంలో మూడున్నర కోట్ల రూపాయలతో నిర్మించిన కేజీబీవీ పాఠశాల భవనాలను, కోడూరు గ్రామంలో ప్రధాన మంత్రి జన్మాన్ పథకం కింద 2 కోట్ల 30 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన వసతి గృహాన్ని కేంద్రమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాతపట్నం నియోజకవర్గానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించడంతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. తాగునీరు.. సాగునీరు.. మౌలిక వసతుల కల్పన వంటి కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

========================

సముద్రంలో వేటకు వెళ్లి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో గల్లంతైన మత్స్యకారుల కోసం తీర రక్షక దళం (కోస్ట్‌గార్డ్) విస్తృతంగా గాలిస్తోందని కోస్టల్ సెక్యూరిటీ ఐజీ గోపీనాథ్ జెట్టీ తెలిపారు. విశాఖపట్టణంలోని కోస్ట్‌గార్డ్ కార్యాలయంలోని ప్రాంతీయ ఆపరేషన్ సెంటర్‌లో ఆయన ఈరోజు సెర్చ్ అండ్ రెస్క్యూ విభాగాల అధికారులతో సమీక్షించారు. ఇప్పటికే కోస్ట్‌గార్డ్‌కు చెందిన రెండు నౌకలు, రెండు హెలీకాప్టర్లు, నేవీకి చెందిన మరో నౌక మత్స్యకారుల కోసం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ సమన్వయంతో యుద్ధప్రాతిపదికన గాలింపు చర్యలు కొనసాగిస్తోందని చెప్పారు. గల్లంతైన ఏడుగురిలో కరి చిన్న అనే ఒక మత్స్యకారుడు పనామా రిజిస్ట్రేషన్ కలిగిన ఓ చైనీస్ మర్చంట్ నౌకకు చిక్కి ప్రాణాలను కాపాడుకున్నారని తెలిపారు. ప్రస్తుతం ఆయన అదే నౌకలో సురక్షితంగా ఉన్నారని వెల్లడించారు. సముద్రంలో ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఆయనను తీరానికి తీసుకురావడం ఆలస్యమవుతుందన్నారు. ఇదిలా ఉండగా విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ నగరంలోని ఆంధ్రప్రదేశ్ మెకనైజ్డ్ ఫిషింగ్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ కార్యాలయానికి ఈరోజు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి భరోసా కల్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... ఇంకా గల్లంతైన ఆరుగురు మత్స్యకారుల కోసం ఇండియన్ కోస్ట్ గార్డ్ అత్యంత వేగంగా గాలింపు చర్యలు కొనసాగిస్తోందని, రాబోయే 72 గంటల పాటు గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేయనున్నట్లు ఆయన వెల్లడిస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

విరామం

========================

రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా ఈరోజు "హ్యోసంగ్ హెవీ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ పవర్ సిస్టమ్స్" PU ప్రెసిడెంట్ యోకోటా తకేషితో.. సియోల్ నగరంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2034 నాటికి 15 గిగావాట్ల ట్రాన్స్ మిషన్ రోడ్ మ్యాప్ తో, 160 గిగావాట్ల క్లీన్ ఎనర్జీ సాధన లక్ష్యంగా పని చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో భారీ స్థాయిలో ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర విద్యుత్ పరికరాల అవసరం ఉందని, తిరుపతి నగరం సమీపంలో స్విచ్‌గేర్లు, ఇతర విద్యుత్ పరికరాల తయారీ లేదా అసెంబ్లింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. యోకోటా తకేషి మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని చెప్పారు. అనంతరం మంత్రి లోకేశ్.. సియోల్ సెమీ కండక్టర్స్ వైస్ ప్రెసిడెంట్ తాయెహ్యూంగ్ లీతో సమావేశమయ్యారు. 2026 సంవత్సరంలో భారతదేశంలోని మొత్తం పెట్టుబడుల్లో 25 శాతం వాటాను, గత 24 నెలల్లో 240 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆంధ్రప్రదేశ్ ఆకర్షించిందని ఆయన చెప్పారు. శ్రీసిటీ పరిసర ప్రాంతాల్లో సియోల్ సెమీ కండక్టర్స్ సంస్థ తమ డిస్‌ప్లే ఫ్యాబ్‌ను ఏర్పాటు చేయాలని లోకేశ్ కోరారు.

========================

దేశ సమగ్రత, ఐక్యత కోసం తుది శ్వాస వరకు పోరాడిన మహనీయులు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా రాయలం గ్రామంలో ఈరోజు జరిగిన డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. శ్యామా ప్రసాద్ ముఖర్జీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం కేంద్ర సహాయ మంత్రి మాట్లాడుతూ... శ్యామా ప్రసాద్ ముఖర్జీ కాశ్మీర్ పూర్తి స్థాయి విలీనం కోసం తుది శ్వాస వరకు పోరాడిన మహనీయుడని కొనియాడారు. `ఆత్మనిర్భర్ భారత్` లక్ష్యంతో ఉక్కు, భారీ పరిశ్రమల రంగాన్ని మరింత బలోపేతం చేస్తూ ఆయన చూపిన మార్గంలోనే కేంద్ర ప్రభుత్వం పయనిస్తోందని శ్రీనివాస వర్మ చెప్పారు.

(వాయిస్ 30 సెకెన్లు)

=========================

ఆగస్టు 29న నిర్వహించనున్న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా.. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో జరగనున్న `అమరావతి ఛాంపియన్‌షిప్–2026` పోస్టర్‌ను విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డి ఈరోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించేందుకు అమరావతి ఛాంపియన్‌షిప్ ఒక మంచి వేదికగా నిలుస్తుందన్నారు. జిల్లాలోని యువతీ యువకులు, క్రీడాకారులు ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాష్ట్ర స్థాయిలో తమ ప్రతిభను చాటాలని పిలుపునిచ్చారు.

=========================

=========================